క్లుప్తంగా

పురస్కార గ్రహీతకు డీఆర్‌ఎం అభినందన



హరిప్రియను అభినందిస్తున్న డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు

తాటిచెట్లపాలెం: ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన 69వ రైల్వే వీక్ వేడుకలలో వాల్తేర్ డివిజన్‌కు చెందిన చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.హరిప్రియ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేతులమీదుగా అతి విశిష్ట సేవా పురస్కార్ అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం వాల్తేర్ డివిజన్, డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు ఆమెను అభినందించారు. ఆమె అందించిన సేవలకు విశిష్ట పురస్కారం లభించడం హర్షణీయమన్నారు. వాల్తేర్ డివిజన్‌లో హరిప్రియ టికెట్ తనిఖీలలో అనుసరిస్తున్న పద్ధతుల వలన వాల్తేర్ డివిజన్ ఆదాయార్జనలో ఆమె కీలకపాత్ర పోషించారని కొనియాడారు.

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు



పోటీల్లో చిత్రాలు గీస్తున్న చిన్నారులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం జాతీయ రహదారి బీఎస్‌ఆర్ భవనంలో విశాఖ చిత్రకళ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం బాలల చిత్రకళ పోటీలను నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన జీవీఎంసీ వైద్యాధికారి హేమలత మాట్లాడుతూ పిల్లలకు లలిత కళలపై ఆసక్తి కలిగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. మరో అతిథి త్రినాథ్ మాట్లాడుతూ చిత్రకళకు వడ్డాది పాపయ్య అంట్యాకుల పైడిరాజు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పోటీల్లో పాల్గొన్న సుమారు 50 మంది చిన్నారులు ఆకట్టుకునే చిత్రాలను గీశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ బుజ్జి, సుంకర చలపతిరావు, మనోహర్, త్యాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం దరి గాంధీనగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, టీడీపీ వార్డు అధ్యక్షురాలు బర్ల పద్మలత, బాలకృష్ణ, గొంప ధర్మారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆఖరి గురువారం పూజలకు ఏర్పాట్లు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి సన్నిధిలో మార్గశిర మాసం ఆఖరి గురువారం పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీటిని ఈవో శోభారాణి, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యార్థం సింహాచలం, గోపాలపట్నం, కంచరపాలెం మీదుగా జ్ఞానాపురం, కనకమహాలక్ష్మి ఆలయానికి ఒక బస్సు, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, పెందుర్తి నుంచి మరో సర్వీసును ఉచితంగా నడపనున్నట్టు ఈవో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథస్వామి ఆలయం వద్ద మహాన్నదానం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్న దృష్ట్యా గురువారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు అమ్మవారి దర్శనాలు ఉండవన్నారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే పంచామృతాభిషేక సేవ రద్దు చేసినట్టు చెప్పారు. రాత్రి 7 తర్వాత అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు.

కరుణ, క్షమ.. క్రీస్తు సందేశం

- బైబిల్ వాక్యాలను వివరించిన పాస్టర్లు
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



క్రీస్తు జననం స్కిట్ ప్రదర్శిస్తున్న క్రైస్ట్ గాస్పెల్ చర్చి సభ్యులు



సెయింట్ సేవియర్స్ ఆర్‌సీఎం చర్చిలో బాలఏసు జననం సెట్



గీతాలు ఆలపిస్తున్న చర్చి సభ్యులు

సీతంపేట: కరుణ, క్షమ, ప్రేమ మానవాళికి క్రీస్తు అందించిన సందేశమని చర్చి పాస్టర్ శ్యాంసుందర్ అన్నారు. క్రీస్తు గొప్పతనానికి అద్దం పట్టే బైబిల్‌లోని పలు సూక్తులను, వాక్యాలను, అంశాలను వివరించారు. గోల్డెన్ హార్వెస్ట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏసును స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా పాస్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రజల కోసం సిలువ నెక్కిన క్రీస్తు బోధించిన శాంతి, సహనం అనుసరణీయమన్నారు. చర్చి యూత్, మహిళలు గీతాలు ఆలపించారు.

బాలఏసు చర్చిలో..

సీతమ్మధార : సీతమ్మధార, పరిసర ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు దైవ సందేశం వినిపించారు. సీతమ్మధారలోని బాలఏసు చర్చిలో క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నక్కవానిపాలెం, తదితర ప్రాంతాలలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక పలు చర్చిల్లో క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేశారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు.

సెయింట్ సేవియర్స్ ఆర్‌సీఎం చర్చిలో..

మురళీనగర్: మురళీనగర్–మాధవధార 48ఏ బస్సు రూటులోని ప్రధాన చర్చి సెయింట్ సేవియర్స్ ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలో ఏర్పాటు చేసిన బాల యేసు జనన వృత్తాంతం విశేషంగా ఆకట్టుకుంది.

క్రైస్ట్ గాస్పెల్ చర్చిలో..

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురం పోర్ట్ క్వార్టర్స్ సమీపంలోని క్రైస్ట్ గాస్పెల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వేడుకలు బుధవారంతో ముగిశాయి. మంగళవారం రాత్రి జరిగిన చిన్న పిల్లల ప్రత్యేక కార్యక్రమాలు, క్యాండిల్ లైట్ సర్వీస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుధవారం యూత్ సభ్యులు, సండే స్కూల్ పిల్లలు ప్రదర్శించిన కొరియోగ్రఫీలు, స్కిట్స్, వాక్యపోటీలు, పాటల పోటీలు ఆకట్టుకున్నాయి. ఏసుక్రీస్తు భూమి పై జన్మించడానికి గల ఉద్దేశం, ఆయన జనన విధానం క్రైస్తవులకు ఆయన ఇచ్చే సందేశం గురించి బ్రదర్ పీ.విజయ్‌కుమార్ వివరించారు. వేడుకలలో క్రైస్ట్ గాస్పెల్ చర్చ్ సీనియర్ పాస్టర్ ఎస్. మోహనరావు, చర్చి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



బాల ఏసు చర్చిలో పశువుల పాక వద్ద ..

అలరించిన 'వాయిస్ ఆఫ్ యూత్'

ఉత్సాహంగా సెమీ క్లాసికల్ సినీగీతాల పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రఘురామారావు

సీతంపేట: మెలోడి క్రియేటర్స్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 15 నుంచి 20 సంవత్సరాలలోపు యువతీ యువకుల కోసం 'వాయిస్ ఆఫ్ యూత్ 2024' పేరిట నిర్వహించిన సెమీ క్లాసికల్ సినీగీతాల పోటీలు ఆసక్తికరంగా సాగాయి. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి. రఘురామారావు ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుట్టుకతో ఎవరూ గాత్రధారులు కాదని, సాధనతోనే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. మంచి గురువు వద్ద శిష్యునిగా చేరి సాధన చేస్తే దేశం గర్వించే గాయకులు, గాయనీమణులుగా రాణించగలరన్నారు. భారత్ వికాస్ పరిషత్ ప్రాంత్ స్థాయి అధ్యక్షుడు వి.సన్యాసిరాజు మాట్లాడుతూ ఇటువంటి పోటీల ద్వారా చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి వీలవుతుందన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు పోటీలో ఉత్సాహంగా పాల్గొని క్లాసికల్ గీతాలు అలపించారు. పోటీలో గెలుపొందిన వారు జనవరి ఒకటో తేదీన పౌరగ్రంథాలయంలో జరగనున్న సంగీత విభావరిలో గీతాలు అలపిస్తారని నిర్వాహకులు తెలిపారు. నగరానికి చెందిన జి.శారద, జి.జ్యోతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మెలోడి క్రియేటర్స్ అధ్యక్షుడు సి.హెచ్.వి.సత్యనారాయణ, కార్యదర్శి ఎం.వి.రాజశేఖర్, ఉషాచీరాల, కొణతాల రాజు, అరుణకాంత్ పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్రులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సీతారామచంద్రస్వామికి నిత్య పూజలతో పాటు పాశుర విన్నపం చేశారు. సీతారామచంద్రులను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

శ్రీరంగనాథుడికి పాశుర విన్నపం

కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటలకు ప్రాతఃకాలార్చన చేశారు. గోదాదేవిని మేళతాళాల మధ్య వేద మంత్రోచ్చరణలతో ఆలయ అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ప్రదక్షిణ చేశారు. అనంతరం తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం సమర్పించారు. గోదాదేవి తరపున శ్రీరంగనాథుడికి 9వ పాశుర విన్నపం చదివి వినిపించారు. ఆలయం ప్రాంగణంలో ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా శేషాచార్యులు 9వ పాశురం ప్రాధాన్యతను వివరించారు. వైభవుడికి నక్షత్ర హారతి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న గొర్లె చందు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ వలన పోర్టు కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా నష్టపోతారని నేషనల్ పోర్టు ట్రస్ట్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు అన్నారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హాస్పిటల్ వద్ద 86 రోజులుగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు బుధవారం కొనసాగాయి. దీక్షల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, వైస్ ప్రెసిడెంట్ పి.వి.రమణ, అప్పలనాయుడు, కృష్ణ, నాగరాజు, హేమంత్, రాఘవులు, వై.వి. రమణారావు, మరిడయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే వెళ్లేదెలా?



చెక్కుడురాయి బిల్డింగ్ వద్ద కల్వర్టుపై ఆటోల పార్కింగ్

సీతంపేట: పది మంది ప్రయాణించడానికి గెడ్డపై నిర్మించిన కల్వర్టులపై కొంతమంది ఆటోలు, వ్యాన్‌లు పార్క్ చేసి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. అక్కయ్యపాలెం చెక్కుడురాయి బిల్డింగ్ వద్ద గెడ్డపై కొద్ది నెలల కిందట బాక్సు కల్వర్టు నిర్మించారు. పాత కల్వర్టు తొలగించి దానిస్థానంలో కొత్తగా కల్వర్టు నిర్మించారు. ఆ కల్వర్టుపై ఆటో డ్రైవర్లు ఆటోలను, లగేజి ఆటోలను పార్క్ చేస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిత్యం కల్వర్టుపై ఆటోలు నిలిపి ఉంచుతున్నారు. కల్వర్టును ఆక్రమించి తోపుడు బండి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్ నుంచి శ్రీనివాసనగర్, నందగిరినగర్ వైపు వెళ్లే వాహనాలు, ఆటోలు, కార్లు ప్రయాణించడానికి ఇబ్బంది ఎదురవుతోంది. ట్రాఫిక్ పోలీసులు స్పందించి కల్వర్టుపై ఆటోలు పార్క్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యర్థాలకు నిలయంగా గ్రీన్‌బెల్ట్‌లు

- కానరాని పచ్చదనం
- పరిశుభ్రతకు నోచుకోని వైనం



53వ వార్డు అంబేడ్కర్ భవన్ దాటాక వ్యర్థాలతో నిండిన గ్రీన్ బెల్ట్



53వ మర్రిపాలెం హైవే వద్ద పిచ్చి మొక్కలతో ఇలా..



51వ వార్డు పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద వ్యర్థాలతో గ్రీన్ బెల్ట్

మర్రిపాలెం: కాంక్రీట్ జంగిల్ వంటి నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంపొందించడానికి ఏర్పాటు చేసిన గ్రీన్‌బెల్ట్‌లు వ్యర్థాలకు నిలయంగా మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చాలా ప్రాంతాల్లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. ఎన్నికలు రావడంతో మరి కొన్నిచోట్ల గ్రీన్ బెల్ట్‌లు అలాగే ఉండిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో గ్రీన్ బెల్ట్‌లు నిరుపయోగంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఆహ్లాదకరంగా ఉండాల్సిన ప్రాంతాలు వ్యర్థాలతో నిండిపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పరిశుభ్రంగా అయినా ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

➡ జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ నుంచి పంజాబ్ హోటల్ జంక్షన్ వరకు గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని వ్యర్థాలకు, పార్కింగ్‌కు వాడుతున్నారు. ఆ ప్రాంతమంతా గ్రిల్స్ వేసినా ప్రజలు వ్యర్థాలు పోసేస్తున్నారని ఆరోపిస్తునారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుందరీకరణ పనుల్లో భాగంగా ఆర్ అండ్ బీ జంక్షన్‌లో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా పరికరాలు, అలాగే జాకీర్ హుస్సేన్ నగర్‌లో అందరూ ఆహ్లాదకరంగా గడపడానికి జీవీఎంసీ ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆ ప్రాంతాలు ఆకర్షణీయంగా ఉండటంతో పాటు సేద తీరేందుకు వీలుగా ఉందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఆ రెండు పార్కులు తప్ప ఆ మార్గమంతా పిచ్చి మొక్కలతో, వ్యర్థాలతో నిండిపోయింది.

➡ పంజాబ్ హోటల్ జంక్షన్ దరి 51వ వార్డులో ఉన్న గంగా గోదావరి అపార్టుమెంట్‌కు సమీపంలో గ్రిల్స్ వేశారు. ఆ ప్రాంతంలో జిమ్ ఏర్పాటుకు వీలైనంత స్థలం లేదు. కానీ అందులో మంచి మొక్కలు వేయవచ్చు. కానీ అలా వేయకుండా గ్రిల్స్ వేసి వదిలేయడంతో స్థానికులు చెత్త పడేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు గ్రీన్ బెల్ట్‌లను సరిగ్గా ఉపయోగించాలని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు వాజ్‌పేయి



వాజ్‌పేయి జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నేత శ్యామలాదీపిక



పట్టాభిరెడ్డితోటలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శతజయంతి వేళ నాయకుల ఘన నివాళులు

సీతమ్మధార : దార్శనికత గల గొప్ప రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ నాయకురాలు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదీపిక అన్నారు. దేశంలో మౌలిక సదుపాయాలు మెరుగు పరిచి ప్రజల జీవన ప్రమాణాలను అభివృద్ధి చేయడానికి ఆయన ఆద్యుడన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రస్తుతం దేశం ప్రపంచ నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి ఉవ్విళ్లూరుతున్న వేళ దేశం ఆనాటి దార్శనిక ప్రధాని వాజ్‌పేయికి రుణపడి ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దార్శనికుడు.. పాలనాదక్షుడు

మురళీనగర్: భారత మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి వేడుకలను పట్టాభిరెడ్డితోటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. 49వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కల్లెంపూడి జగదీష్ ఆధ్వర్యంలో కప్పరాడ మండల అధ్యక్షుడు ఒమ్మి నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలను నడిపిన గొప్ప దార్శనికుడిగా వాజ్‌పేయి గుర్తింపు పొందారన్నారు. దేశం కన్నా ఏదీ ముఖ్యం కాదని ఆయన నిరూపిస్తూ పరిపాలన సాగించారని వివరించారు. కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శులు కొప్పిశెట్టి ప్రసాద్, పులిగి శ్రీనివాస్, కార్యదర్శి భాస్కర్, పద్మ, మోర్చా అధ్యక్షుడు మంత్రి సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల విజయవంతానికి ర్యాలీ



జాతీయ రహదారిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం: పెందుర్తిలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కంచరపాలెం, ఊర్వశి కూడలి ప్రాంతాల్లో బుధవారం ప్రచారాలు నిర్వహించారు. కంచరపాలెం బీఆర్‌ఆర్ భవనం వద్ద పార్టీ సీనియర్ నాయకులు పెంటకోట రాము, సీహెచ్ కమల పతాకావిష్కరణ చేశారు. కంచరపాలెం జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల ఈశ్వరమ్మ, బి.పద్మ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో సీపీఎం ఏర్పడి 72 సంవత్సరాలు పూర్తయిందన్నారు. అనేక పోరాటాలు త్యాగాలు చేసి, బలమైన ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ కార్మికులు, కష్టజీవుల తరఫున శ్రమిస్తోందన్నారు. 28 నుంచి జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఊర్వశికూడలిలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సానబోయిన అప్పలరాజు, సోమేశ్వరరావు, ఒమ్మి అప్పారావు, విజయ, బి.సింహాచలం, జి.అప్పలరాజు, ఎం.ఈశ్వరరావు, ఎస్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

దాబాగార్డెన్స్: పాతనగరం మునసికంటివారి వీధికి చెందిన ఓ వ్యక్తి సైనేడ్ మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి మునసికంటి వారి వీధికి చెందిన రామోజు చినబాబు సమస్యల కారణంగా సైనేడ్ మింగి ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం వచ్చిందని, సంఘటన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి పంపినట్టు పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్ టౌన్ సీఐ జి.దేముడుబాబు తెలిపారు.